క్లుప్తంగా

వేసవి వ్యాధులపై అప్రమత్తత అవసరం

మండపేట: వేసవిలో వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్యుడు ఎం.కిరణ్‌కుమార్ సూచించారు. పట్టణంలో ఆదివారం కమ్యూనిటీ పారామెడిక్స్ ఫ్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల స్థాయిలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సూరంపూడి వీరభద్రరావు, కోశాధికారి మట్టా వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్‌వి. రమణ, జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రాము పాల్గొన్నారు.

మండపేటలో సాయుధ బలగాల కవాతు



మండపేట వీధుల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మండపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో ఆదివారం కేంద్ర ప్రభుత్వ సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. పట్టణ సీఐ అఖిల్ జమ పర్యవేక్షణలో ఎస్సై ఎల్.నాంచారయ్య ఆధ్వర్యంలో 90 మంది సాయుధ పోలీసులు పట్టణ వీధుల్లో కవాతు చేశారు. ప్రజలకు ఎన్నికల కోడ్ నియమ నిబంధనల గురించి వివరించారు. ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. నాంచారయ్య మాట్లాడుతూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు తగిన స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించడంలో భాగంగానే కవాతు చేశామన్నారు. నిబంధనలను అతిక్రమించినవారిపై చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామన్నారు.

వంగా శ్రీనుకు ఎమ్మెల్సీ తోట పరామర్శ

కపిలేశ్వరపురం: పితృ వియోగంతో బాధపడుతున్న పడమర ఖండ్రిక పంచాయతీ మాజీ సర్పంచ్ వంగా శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, సర్పంచులు తిరునాతి ఆదిలక్ష్మి, వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అడ్డాల శ్రీనివాస్‌లు ఆదివారం పరామర్శించారు.


తాపేశ్వరంలో యువ నేత పర్యటన



తాపేశ్వరంలో ఇంటింటి పర్యటనలో తోట పృథ్వీరాజ్

మండపేట: పేదల ప్రయోజనాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే నెరవేరతాయని ఎమ్మెల్సీ తనయుడు, యువ నేత తోట పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని తాపేశ్వరంలో ఆదివారం ఆయన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులతో కలిసి ఇంటింటి పర్యటన చేశారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నాగిరెడ్డి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు పంపన లక్ష్మి, పిల్లా రామలక్ష్మి, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, నాయకుడు కరుపూడి రాంబాబుతో కలిసి ఇంటింటికీ వెళ్ళి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.

భక్తిశ్రద్ధలతో సప్తాహం



ఉట్రుమిల్లిలో రాముని సప్తాహంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న భజన బృందం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉట్రుమిల్లిలో వేంచేసిన కోదండ రామాలయం వద్ద శ్రీ జ్ఞాన సరస్వతి మహిళా భజన బృందం ఆధ్వర్యంలో శ్రీ రామ సప్తాహం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం భజన బృందం గురువు వానపల్లి తాతారావు నేతృత్వంలో భజన బృందం సభ్యులు కట్టా నాగార్జునమ్మ, చొల్లంగి నాగమణి, సూరంపూడి చంద్రకాంతం, మేడిశెట్టి నాగమణి, కురుపూడి వరలక్ష్మి, కురుపూడి శ్యామల తదితరులు భక్తి గీతాలు ఆలపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పల్లెలకు ఆరోగ్య రక్ష

- వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు
- ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమాల నిర్వహణ



అముజూరులో పేదలకు వైద్యం చేస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్ టీం సభ్యులు (ఫైల్)

కె.గంగవరం: గ్రామీణుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. మారుమూల ప్రాంతాల ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాలతో పంచాయతీ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని కమిటీలను ఏర్పాటు చేశారు. ఆరోగ్యరంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణులకు విస్తృత సేవలు అందించేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీలతో సరికొత్త విధానానికి రూపకల్పన చేశారు.

ఆరుగురు సభ్యులతో కమిటీ..

ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఆరుగురు సభ్యులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సీహెచ్‌వో మిడ్‌లెవెల్ ప్రొవైడర్ ప్రతి గ్రామంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్, స్కూల్ హెల్త్ అంబాసిడర్, గ్రామాల్లో డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ

గ్రామీణుల ఆరోగ్యంపై ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీ నిరంతరం పర్యవేక్షించాలి. ప్రధానంగా గర్భిణులు, శిశువులు, మహిళలు, వృద్ధులు, పిల్లలు, రక్తహీనత, పోషకాహారలోపం ఉన్నవారిని గుర్తించాలి. గ్రామీణ ప్రజల జీవనశైలి, రోగాల నివారణ, చికిత్సలపై కమిటీ అప్రమత్తంగా ఉండాలి. పాఠశాల విద్యార్థుల ఆరోగ్య వివరాలను స్కూల్‌లోనే హెల్త్ అంబాసిడర్లు పర్యవేక్షించాలి. కౌమార దశలోని బాలబాలికలకు రోజూ ఐఎఫ్ఏ మాత్రలు పంపిణీ చేయాలి. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. యుక్తవయస్సు బాలికలకు శానిటరీ ప్యాడ్ల సరఫరా వివరాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల మధ్యాహ్న భోజన వివరాలను కమిటీ లీడర్లకు అందించాలి. ఫ్యామిలీ డాక్టర్ల ద్వారా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు పిల్లల రక్తహీనతపై పర్యవేక్షణ, గర్భిణులకు ప్రసవాలకు ముందు, తర్వాత సంరక్షణ, నులిపురుగుల నిర్మూలన, మందుల పంపిణీ, ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం అందించడం వంటి సేవలు అందేలా సమన్వయం చేసుకోవాలి. గ్రామాల్లో నిర్వహించే డ్వాక్రా గ్రూపు సమావేశాలకు టీం లీడర్లు విధిగా హాజరయ్యేలా టీంలో ఉన్న డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి. గ్రూపు సభ్యుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకోవాలి. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇమ్యునైజేషన్ ద్వారా రోగ నిరోధకత పెంచడం ద్వారా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి. బాల్యవివాహాలను నివారించడంతో పాటు యుక్తవయస్సులో గర్భాన్ని నిరోధించాలి. ప్రతి శుక్రవారం డ్రై డే, పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలి. క్షేత్ర స్థాయిలో సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా చూడాల్సిన బాధ్యత పీహెచ్‌సీ వైద్యాధికారిపై ఉంటుంది.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

గ్రామాల్లో ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరుగురు సభ్యులతో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశాం. సంపూర్ణ ఆరోగ్యం దిశగా పల్లెలను తీర్చిదిద్దుతాం. ఈ కమిటీల ఏర్పాటు ద్వారా గ్రామీణ ఆరోగ్య సమస్యను పరిష్కరించవచ్చు. ఆరోగ్య పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపించేందుకు చర్యలు చేపడతాం.

– ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, కె.గంగవరం

ప్రజలకు ఎంతో ఉపయోగం

విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా హార్ట్‌అటాక్, క్యాన్సర్ తదితర సమస్యలపై అవగాహన కల్పిస్తాం. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తాం.

– పార్వతి, వైద్యాధికారి

అన్ని పార్టీలు మద్యపాన నిషేధం ప్రకటించాలి



మండపేటలో మద్యపాన ప్రభావంపై మాట్లాడుతున్న సూర్యనారాయణ

మండపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలూ సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని ప్రకటించాలని జనవిజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో మద్యపాన వ్యతిరేక ప్రచారం నిర్వహించారు. సమితి కన్వీనర్ డాక్టర్ ఎన్. సూర్యనారాయణ ఆధ్వర్యంలో పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర ఆదివారం మండపేట చేరుకుంది. పట్టణంలోని పార్కులు, ప్రధాన కూడళ్లలో డాక్టర్ సూర్యనారాయణ మాట్లాడుతూ మద్యపానం వల్ల కలిగే చెడు ప్రభావాల గురించి వివరించారు. జిల్లా యూత్ కన్వీనర్ ఉద్దండపు గుణ, కో కన్వీనర్ కె.అభిరామ్, సామాజిక కార్యకర్త విజయ వాహిని, చర్ల శ్రీనివాసరెడ్డి, జన విజ్ఞానవేదిక కార్యకర్తలు పాల్గొన్నారు

పేదల పక్షాన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

- సీఎం జగన్‌ను ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్



కృత్తివెంటి గ్రౌండ్‌లో వాకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్

రామచంద్రపురం: ఐదేళ్ల పాటు పేదల పక్షాన నిలుస్తూ సంక్షేమ పథకాలను అందించి తిరిగి ప్రజల ఆశీర్వాదం కోసం వారి ముందుకు వస్తున్న నిబద్ధత గల ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ప్రస్తుతం జరగబోతున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. ఆదివారం ఉదయం పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో వాకర్స్‌తో కలిసి వాకింగ్‌లో పాల్గొన్నారు. వివిధ వర్గాలతో కలసి ఆయన మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో అబద్ధాల పాలన సాగించిన ప్రతిపక్షం నేడు తిరిగి ప్రజలను మోసం చేసేందుకు ఓట్ల కోసం ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. గతంలో ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన చంద్రబాబునాయుడు హయాంలో చెప్పుకునేందుకు ఒక్క పథకం కూడా లేదని, అలాంటి వారు ప్రజలను మేము ఉద్ధరిస్తామంటూ అబద్ధాలు చెబుతూ వస్తున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేయగలిగిందే చెబుతారని, మాటిస్తే కచ్చితంగా హామీలను అమలు చేస్తారని ఈ ఐదేళ్లలో ప్రజలందరూ చూశారన్నారు. చెప్పింది చెప్పినట్లు నవరత్న పథకాలను ప్రజలను నేరుగా అందించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ప్రతి 2వేల ఇళ్లకు ఒక సచివాలయం ఏర్పాటు చేసి పేదల వద్దకు పరిపాలనను తీసుకువచ్చి దేశంలోనే నంబర్‌వన్‌గా రాష్ట్రం నిలిచిందన్నారు. ప్రతి పథకాన్ని అర్హులైన లబ్ధిదారులందరికీ కులం, మతం, పార్టీలకు అతీతంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు అందిచిన ప్రభుత్వం మన ప్రభుత్వం అన్నారు. తిరిగి పింఛన్ ఇంటికి రావాలన్నా, సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకే అందాలన్నారు. నవరత్న పథకాలు అమలు కొనసాగాలన్నా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ఎన్నుకోవాలన్నారు. దీనికోసం ప్రజలందరూ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను బలపర్చాలని సూర్యప్రకాష్ కోరారు. కృత్తివెంటి క్రీడా ప్రాంగణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని సూర్యప్రకాష్ చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తొగరు మూర్తి, కౌన్సిలర్ కేతా సుజాత, కేతా శ్రీను, పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, తోట సూరిబాబు, గుణ్ణం వెంకటేశ్వరావు, శీలం గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: మండలంలోని తాపేశ్వరం గ్రామానికి చెందిన మేడిశెట్టి నీలకంఠేశ్వరరావు, గరగ సతీష్, ధనాని వీరప్రతాప్, ధనాని రాజు, మద్య వరహాల మూర్తి, చవాకుల బాబూరావు, పోతాల నారాయణ, బూర ధనరాజు, బూర శ్రీను ఆధ్వర్యంలో 50 మంది ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నియోజకాభివృద్ధికి ఎమ్మెల్సీ తోట చేస్తున్న కృషికి ఆకర్షితులమై తాము పార్టీలో చేరినట్టు తెలిపారు. పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్సీ తోట అన్నారు. చేరిన వారిని ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, నాయకులు కురుపూడి రాంబాబు, ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం, సిరిపురపు శ్రీనివాస్, నాగిరెడ్డి రాంబాబు, పిల్లా సత్తిబాబు, పంపన పద్మారావు, దాసరి లాజరు అభినందించారు.

రామచంద్రపురంలో టీడీపీకి షాక్



రాయుడు లీలాశంకర్‌తో కలసి టీడీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: రామచంద్రపురం నియోజక వర్గంలో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ ఇన్చార్జ్ రాయుడు లీలాశంకర్ తన అనుచరులతో కలసి పార్టీ పదవులకు, సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం తణుకువాడలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తన నిర్ణయాన్ని ప్రకటించారు. అభ్యర్థుల ఎంపికపై టీడీపీ తీరుపై లీలాశంకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికేతరులకు టీడీపీ టికెట్ కేటాయించబోతుందన్న ప్రచారాలపై గత నెల రోజుల క్రితమే లీలాశంకర్ తదితరులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వలస పక్షులకు సీటు ఇస్తే రాజీనామా చేస్తామని బహిరంగంగానే ప్రకటించారు. అయినప్పటికీ కార్యకర్తల మనోభావాలను ఏమాత్రం పట్టించుకోకుండా టీడీపీ స్థానికేతరుడికే టికెట్ కేటాయించింది. పార్టీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తన నిర్ణయాన్ని పక్కన పెట్టి గత 20 రోజులుగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ వచ్చానని అయితే అభ్యర్థి ప్రవర్తన, పార్టీ తీరు తనను తీవ్ర మనస్థాపానికి గురిచేయడంతో రాజీనామా చేశానని లీలాశంకర్ తెలిపారు. టీడీపీ నాయకులు రాయుడు సత్యనారాయణ, సీహెచ్ బాబూరావు, పిల్లి వీరవెంకటసత్యనారాయణ, దెయ్యాల శివప్రసాద్, చెల్లుబోయిన కృష్ణ, మట్టపర్తి రామనాథ్, మట్టపర్తి శ్రీను, కొప్పుశెట్టి శ్రీనివాస్ తంగెళ్ల లోవరాజు తదితరులు లీలాశంకర్‌తో కలసి టీడీపీకి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

దాతృత్వానికి ప్రతీక రంజాన్ మాసం

అబ్దుల్‌కలాం ట్రస్టు ద్వారా పేదలకు రంజాన్ తోఫా



రంజాన్ తోఫా కిట్లు అందిస్తున్న ట్రస్టు చైర్మన్ మౌలానా

మండపేట: రంజాన్ మాసం దాన, దయాగుణాలను చాటుతుందని ఈ మాసంలో ప్రతి ముస్లిం కూడా దాతృత్వాన్ని అలవాటు చేసుకోవాలని మస్జిద్ అఖ్సా కన్వీనర్, అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ మౌలానా అన్నారు. స్థానిక సత్యశ్రీ రోడ్డు శివారులో ఆదివారం అఖ్సా మస్జిద్ వద్ద అబ్దుల్ కలామ్ ఆజాద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు కిరణా సరకులు కిట్లు పేద ముస్లింలకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ మౌలానా మాట్లాడుతూ రంజాన్ మాసంలో దానధర్మాలు చేయడం ద్వారా నిరుపేదల కడుపు నింపినవారం అవుతామన్నారు. నూర్‌బాషా సంక్షేమ సంఘం కోనసీమ జిల్లా అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని ముస్లింలు అతి పవిత్రంగా భావించి ఉపవాస దీక్షలు పాటిస్తూ, అల్లాహ్‌ను వేడుకుంటారన్నారు. ట్రస్టు కార్యదర్శి షేక్ చిన్న బాదుల్లా, కార్యవర్గ సభ్యులు షేక్ మౌలాలి, షేక్ మహబూబ్ బాషా, డాక్టర్ రెహమాన్, మేనేజింగ్ ట్రస్టీ ఎండీ అతిక్,షేక్ చాందిని, ఎండీ జినత్ తదితరులు పాల్గొన్నారు.

లోకానికి వెలుగులు చూపిన రారాజు జీసస్

- మండలంలో ఘనంగా ఈస్టర్ పండుగ
- పసలపూడిలో దుస్తులు, చీరల పంపిణీ



పసలపూడిలో వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత చైతన్య రాజబాబు



మండపేట సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

రాయవరం: లోకానికి వెలుగులు చూపిన రారాజు జీసస్ అని హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ రెవరెండ్ జీవన్, వైఎస్సార్ సీపీ నేత చైతన్య రాజబాబు అన్నారు. మండలంలోని పసలపూడి కళాసాగర్ శ్రీ ఏసు కరుణాలయం బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. చైతన్య రాజబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాస్టర్ పి.భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఏసు శిలువ మరణం మానవాళి పాప విమోచనకు దోహదపడిందని, పాపులను పునీతులను చేసేందుకే క్రీస్తు శిక్ష అనుభవించారన్నారు. అనంతరం చైతన్య రాజబాబు సౌజన్యంతో పాస్టర్ దంపతులకు దుస్తులు, 60 మంది వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు.అలాగే మెరిపే ప్రసాదరావు చర్చికి రూ.26 వేల విలువైన కీబోర్డును అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య రాజబాబును పాస్టర్ పి.భాస్కరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు డీఆర్‌సీ రెడ్డి, ఎస్‌వీవీఎస్ఎన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులు ఆదివారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శ్మశానవాటికల్లో తమ కుటుంబీకుల సమాధులను రకరకాల కొవ్వొత్తులు, పూలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గీతాలాపనలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో తెల్లవారుజామున ర్యాలీలు నిర్వహించారు.

కపిలేశ్వరపురం: ఈస్టర్‌ను మండలంలోని గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి, వెదురుమూడి, నేలటూరు, వల్లూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగుల చెరువు, వాకతిప్ప అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో క్రైస్తవ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పూర్వీకుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి వారి జ్ఞాపకాలను నెమలు వేసుకున్నారు.

మండపేటలో...

మండపేట పట్టణం, రూరల్ మండలంలోని 12 గ్రామాల్లో క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వీధుల్లో ఈస్టర్ ప్రాధాన్యతను వివరిస్తూ కీర్తనలు పాడుతూ ఊరేగింపు నిర్వహించారు.

కె.గంగవరం మండలంలో..

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పునరుత్థాన(ఈస్టర్) పండగను క్రైస్తవ విశ్వాసులు ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని పామర్రు, అముజూరు, కె.గంగవరం, మసకపల్లి, యర్రపోతవరం, భట్లపాలిక, కుందూరు, కోటిపల్లి తదితర గ్రామాల్లో చర్చిల్లో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్ని గ్రామాల్లోని క్రైస్తవ విశ్వాసులు తమ కుటుంబీకులకు చెందిన సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అముజూరులో మన్నా చర్చిలో నిర్వహించిన పండగలో పాస్టర్ యం.జాన్‌బాబు మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమని, క్రైస్తవ విశ్వాసులు క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చిల వద్ద విశ్వాసులు సహపంక్తి భోజనాలు చేసి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు.

కాజులూరులో..

కాజులూరు: తన వలే తోటివారిని, పరులను సమానంగా ప్రేమించువారే ప్రభువైన ఏసుకు ఇష్టమైన భక్తులని వైఎస్సార్ యువసేన జాతీయ అధ్యక్షుడు ఉంగరాల లక్ష్మణరావు అన్నారు. మండల గ్రామాలలో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గొల్లపాలెంలో వైఎస్సార్ యువసేన రాష్ట్ర కార్యదర్శి ఉంగరాల శివ ఆధ్వర్యంలో లక్ష్మణరావు పలువురు పేద వృద్ధులకు బిర్యాని, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుప్రభువు అడుగుజాడల్లో సీఎం జగన్ నడుచుకుంటున్నారన్నారు. జగనన్న తనకంటే పరులను, పేదలను ఎక్కువగా ప్రేమిస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల యువజన విభాగ కన్వీనర్ పెంకే వెంకటరమణ, పార్టీ నాయకులు మాదిరెడ్డి పృథ్వీ, నరాల తిరుపతిరావు, గంటి ఇశ్రాయేలు, వెళ్ళ సేవగ్, వాసంశెట్టి మహేశ్ పాల్గొన్నారు.



అముజూరు మన్నా చర్చిలో ఈస్టర్ పండగ సందర్భంగా కీర్తనలు పాడుతున్న చిన్నారులు



గొల్లపాలెంలో పేదలకు బిర్యాని, పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ఉంగరాల లక్ష్మణరావు తదితరులు

ప్రభుత్వ పాఠశాలల్లో సంస్కార విద్య

- విశ్వ మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస చౌదరి
- లొల్లలో యోగా థెరపీ, హోమియో వైద్య శిబిరాలు



సంస్కార విద్య పుస్తకావిష్కరణ అనంతరం విద్యార్థులతో శ్రీనివాసచౌదరి, ఫణికృష్ణారెడ్డి

రాయవరం: ప్రతి విద్యార్థికీ ఆరోగ్యం, పరిపూర్ణ విద్య, ఉన్నత వ్యకిత్వం అందించాలనే లక్ష్యంతో విశ్వ మానవతా సంస్థ వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంస్కార విద్య కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస చౌదరి అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని లొల్ల గ్రామంలో ఆదివారం వ్యక్తిత్వ వికాస శిబిరాన్ని, ఆరోగ్యం, యోగా థెరపీ, హోమియో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ నేటి సమాజంలోని చిన్నారులకు ఆరోగ్యంతో పాటుగా, ఉత్తమ సంస్కారాన్ని అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మానవతా సంస్కార విద్యలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేస్తేనే ఆ లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. ప్రముఖ యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజ సేవకు, విద్యార్థుల్లో సంస్కార విద్య ద్వారా మార్పు తెచ్చేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసచౌదరి రచించిన 'విద్యార్థి విజయానికి రాజపథం', 'మానవత సంస్కార విద్య' పుస్తకాన్ని హాజరైనప్రముఖులు ఆవిష్కరించారు. ఉచిత హోమియోపతి ప్రముఖ వైద్యులచే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. 120 మంది రోగులకు ఉచితంగా హోమియో వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వ మానవత సంస్థ వలంటీర్లు సుజాత, వినీత తదితరులు పాల్గొన్నారు.

పాపాజీ మాస్టారుకు ఉద్యోగ విరమణ సత్కారం



వెల్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపాజీ, సుందరి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల(గాంధీ సెంటర్) ప్రధానోపాధ్యాయుడు కొడమంచిలి శ్రీపాపాజీ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. పాపాజీ మాస్టారు, ఆయన సతీమణి పీఎస్ బీఎస్‌కే సుందరి (హసన్‌బాద జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం)లను దుశ్శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ 26 సంవత్సరాలుగా విద్యా బోధనలో, వెల్ల కాంప్లెక్స్ సెక్రటరీగా, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తెలగాని తిలక్‌బాబు, కాంప్లెక్స్ చైర్‌పర్సన్ డి.వీరభద్రరాజు, కాకినాడ జిల్లా ఏఎంఓ చామంతి నాగేశ్వరరావు, పీఆర్టీయూ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, కోనసీమ జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం, పీఆర్‌టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ వాడ్రేవు శ్రీనివాస్, ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి, సీవీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు వాడ్రేవు పద్మావతి, చాపిరెడ్డి ముత్యాలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.